# వ్యర్థజీవి

డాక్టరు శివరామయ్యకి చెన్నపట్టణంలో ఇప్పుడు వున్న పేరు రెండో డాక్టరుకి లేదు. అతను సొంతగా ఒక నర్సింగు హోము పెట్టి, దానిని సాధారణమైన హాస్పిటలుకంటె బాగానే నిర్వహిస్తున్నాడు. అసిస్టెంట్లని కూడా పెట్టుకొని, వంతుప్రకారము డ్యూటీలు నిర్ణయిస్తూ, చాలా జాగ్రతగా ప్రాక్టీసు సాగించుకుంటున్నాడు. నర్సింగుహోము ఎగ్మూరులోనూ, నివాసము మాంబళములోనూ అవడంచేత, అతని కుటుంబవిషయాలు అసిస్టెంట్లకి యేమాత్రమూ తెలిశేవికావు. మంచి నిపుణుడని పేరూ, దిట్టమైన ఆదాయమూ వస్తోందికాని, అతను ఫలాని వూరివాడనీ, కులగోత్రాలు యివి అనీ కూడా ఎవరికీ తెలియదు. మనిషినిమాత్రం ఒంటరిగా కూర్చున్నప్పుడు, చూసి కనిపెట్టినట్లయితే వాల్చిన మొహంలో యేవో విచారరేఖలుమాత్రం పొడగడతాయి.

సౌహార్దమూ, నెమ్మదీ, నయత్వమూ అతనిలో మూర్తీభవించాయి.

అసిస్టెంటు నారాయణమూర్తి, కొన్నిమాసాలక్రిందటనే విద్యార్థిదశను సాంతముచేసికొని అనుభవంకోసము శివరామయ్య దగ్గర చేరాడు. స్వభావముచేత నారాయణమూర్తి కొంచెం కుతూహలం కలవాడు. ఇరవైమూడోయేడు వచ్చేదాకా పుస్తకాలుతప్ప మరేమీ చూడనందువల్ల, ప్రపంచానుభవం అతనికి చాలా తక్కువ. ఏమనిషిని చూసినా, ఏమాట విన్నా

అతనికి అయోమయంగా వుండేది. ఆస్పత్రికి సరిగ్గా పదింటికి వచ్చి సాయంత్రం అయిదున్నరకు వెళ్లిపోతూన్న డాక్టరు అతనికి వచ్చి వెలక్కాయ అయినాడు.

సాయంత్రము అయిదున్నర కావచ్చినది. డాక్టరు శివరామయ్య, మళ్లీ ఒకసారి వార్డులన్నీ తిరిగి, రోగుల్నిఅందర్నీ కదిలించి, యింటికివెళ్లే ప్రయత్నంలో వున్నాడు. సాయంత్రము నాలుగు గంటలికివచ్చి, రాత్రి పదింటిదాకా డ్యూటీచెయ్యవలసిన నారాయణమూర్తి బయటిహాలులో ఆలోచిస్తూ పచారుచేస్తున్నాడు. శీతకాలం కావడంచేత కనుచీకటిగా వుంది.

"డాక్టరుగారు ఉన్నారా, అండి?" అన్న సన్నబలహీనమైన కంఠము అతని ఆలోచనల్ని అరికట్టింది. ఉలికిపడి, రెండుకళ్లూ యెత్తి చూశాడు. "డాక్టరుగారున్నారా, లోపల?" మళ్లా అదేధ్వని. ఎదురుగావచ్చి నిలుచున్న శుష్కించిపోయిన స్త్రీ శరీరము పలికింది, ఆ మాటల్ని. ఆస్త్రీ ధరించిన మాసిపోయిన తెల్లచీరా, నల్లరవికా, ఎలక్ట్రిక్ దీపపు వెలుతురులో మాపుతగ్గి, కొంచెం కాంతిగా అగుపించాయి. పాలిపోయిన ఆమె దేహం, దైన్యాన్ని వ్యక్తపరుస్తూన్న ఆమె మొహమూ, అనుభవంలేని ఆ కుర్రడాక్టరుకి యేమీ అవగాహన కానియ్యలేదు.

నిదానంగా ఆమెకేసిచూసి "ఎందుకు?" అన్నాడు.

ఆమె:—ఆయన దగ్గరికి నన్ను తీసుకువెళ్లండి; మీకు పుణ్యముంటుంది.

నారా:—ఏమిటి - ఎందుకు?

ఆమె:—ఆయన్ని చూడాలి. నేనాయన్ని ఎరుగుదును.

నారా:—చెపుతాను ఆయనతోటి.

అని అతడు డాక్టరుదగ్గిరకి వెళ్లాడు; డాక్టరు మొహంలో ఏమీ భావం అతనికి పొడగట్టలేదు. డాక్టరుమాత్రం ఆలోచించాడు.

"ఎందుకూ రమ్మను. అడుగుదాము—ఇదొక కొత్తవిషయమే, ఇంత వరకూ—" డాక్టరు ఏమాటా చాలా త్వరగా పైకి అనేసేవాడు కాడు; అందులో, తాబేదార్లదగ్గర ఎంతవరకు మాట్లాడాలో అతనికి తెలుసును. నారాయణమూర్తికి యిలాటి సంఘటనలు చూడటమంటే సరదా. క్రాపు సరి చేసుకుంటూ వెళ్లి "రమ్మన్నారు, డాక్టరుగారు" అంటూ ఆమెను తీసికొనివెళ్లి డాక్టరుకి యెదురుగానిలిపి, తనుప్రక్కగా నిలుచున్నాడు. వీళ్లు వెళ్ళేసరికి, బేసినులో చేతులు కడుక్కుంటూవున్న డాక్టరు, ఆమె కేసి పరకాయించి చూశాడు. ఆమె రూపం యెప్పుడో తను యెఱిగిన ఏమనిషి రూపంలోనో ఒక ఛాయ అని, అతడనుకున్నాడు.

"ఏమీ కావాలమ్మా నీకు?" అన్నాడు డాక్టరు. ఆమె రెండు చేతులూ జోడించింది. కళ్లు నీళ్లతో నిండాయి. పెదిమలు చలించాయి. మనిషే ఒకసారి ముందుకీ వెనక్కీ కంపించిందేమో కూడాను.

"అయ్యా!......మీ కాళ్లు పట్టుకుందామని వచ్చాను. మీరే నాకు దిక్కనుకున్నాను. ఛండాలురాలి—" అన్నదామె.

డాక్ట:—ఏమి కావాలి? అన్నాడు కొంచెం మందలింపుగా.

ఆమె:—తమదయ. మీరు తప్ప నాకిక దిక్కులేదు. తమర్నినమ్మి యిక్కడకు వచ్చాను.

డాక్ట:—నాకర్థము కాలేదు. మా ఆస్పత్రిలో వుంటావా?

ఆమె:—అవసరమని మీరు చెపితే; నన్నేమి చేయమంటే అదే చేస్తాను. నన్ను సంపూర్తిగా మీ స్వాధీనము చేసుకుంటున్నాను.

ఆమె అన్నమాటలకి డాక్టరుకి కొంచెం అసహ్యం వేసిందేమో, ఆదోమాదిరిగా నిశ్వాసించాడు. అసిస్టెంటు నారాయణమూర్తి చెవులు రిక్కించుకొని వింటున్నాడు. అతనికి యిదిఅంతా అయోమయంలాగ వుంది. చివరికి ఏమి తేల్తుందో చూదామని అతనికోరిక.

ఆమె:—బీదదాన్నీ, అపరాధినీ అయిన నాకు మీరే దిక్కని తోచింది. లోకమంతా తమ మంచిపేరు—

డాక్ట:—అదంతా అనవసరము. ఆస్పత్రిలో చేర్చుకుంటాను. నా సాధ్యమైనంతవరకూ వైద్యము చేస్తాను.

ఆమె:—మీ యిష్టము. యీ అవస్థలో, నేను చేసిన పాపాలకీ నేను పడిన బాధలకీ ముక్తిమీరే.

డాక్ట—అబ్బే...అలాంటి మాటలన్నీ వద్దు. నారాయణమూర్తీ!

నారా:—సర్.

డాక్ట:—ఎగ్జామినేషన్ రూములోకి తీసుకొనిపద యీమెను.

"యస్"అని ఆమెను తనవెంట తీసుకొనివెళ్లాడు నారాయణమూర్తి.

ఆమె కంఠధ్వని, డాక్టరుకి తను యెప్పుడోవిన్న కంఠధ్వనిలోని భాగమేమో ననిపించింది. అతను ఆలోచించాడు. "ప్చ్" అని అతని పెదవులుమాత్రము చప్పరించాయి.

[అరవైతొమ్మిది

ఎగ్జామినేషన్ రూములోకివెళ్లి ఆమెను పరీక్షచేసి, "వెనీరియల్ వార్డులో, నాలుగోబెడ్ యిచ్చెయ్యి. ప్రిస్క్రిప్షను యిస్తాను, ఛార్టు పంపించు నర్సుచేత" అని చెప్పి తాను చెయ్యవలసిన పనులు పూర్తిచేసుకొని వెళ్లిపోయాడు డాక్టరు.

నారాయణమూర్తికి, డాక్టరుతోటి ఆమెఅన్న ప్రతిమాటలోనూ యేదో గూఢార్థము వుందనీ. పూర్వగాథను స్మృతికి తెచ్చేభావంతో మాట్లాడుతోందనీ అనిపించింది. డాక్టరుచెప్పే జవాబు లన్నిటిలోనూ, ఆమెను డాక్టరు అర్థముచేసికోనట్టు తోచింది.

ఆమెస్థితి రోజురోజుకూ చెడిపోవడ మారంభించింది. డాక్టరు, ఆమెను అందరు రోగులతోటీ సమంగానే సమమైన ఆదరణతోనే చూస్తూ మందిస్తున్నాడు. అతను వచ్చినప్పుడల్లా ఆమె రేదో తప్పుచేసి పశ్చాత్తాపపడుతూన్నట్టు మాట్లాడేది. అన్నిటికీ డాక్టరు అంటీఅంటనట్లు సమాధానము చెప్పేవాడు; ఆమె పొగడటము ఆరంభించినప్పుడు వారించేవాడు; ఆమె ఆరోగ్యమువిషయమై మాత్రం అతి జాగ్రత్తగా, అమిత అదుర్దాతోటి పనిచేసేవాడు. ఆమె శరీరస్థితిని విచారించడంలో బహుశ్రద్ధగా వుండేవాడు. అడగవలసింది బహుశ్రద్ధగా ఆమెను అడిగేవాడు. ఆమె యెందుకో, కన్నీళ్లు ధారలుకట్టేటట్లు యేడ్చేది. అతను యేడవవద్దనేవాడు.

డాక్టరు అందరు రోగుల్నీ వరుసగా చూసేవాడు; ఆమెను చూసిన తరువాత చూడవలసినవాళ్లు వున్నా, తనగదిలోకి వెళ్లి రెండుమూడు నిమిషాలకి బయటికివచ్చి, మళ్లా తక్కినవారిని చూసేవాడు. గదిలోకివెళ్లి యేంచేశేవాడు ? యేదో ఆలోచించేవాడు. తక్కినవారినిగురించి కాక, ఆమె విషయమై అతను చూపిస్తూవున్న క్రొత్తపద్ధతి యిది వొక్కటే.

నారాయణమూర్తికి యిదే వింతగా తోచేది. గదిలోకివెళ్లి డాక్టరు సమన్వయము చేసుకొనే ఆమె మాటలలోని భావము యేమిటి? ఆమె యెవరో డాక్టరుకి తెలుసునా తెలియదా? ఆమె ఎవరు? ఆమెకీ డాక్టరుకీ సంబంధము యేమిటి? ఇది నారాయణమూర్తికి అప్పుడు పట్టుకున్న సంధిగ్దావస్థ. కాని డాక్టరుగారిని ఆ విషయమై అడుగుదామని......! అమ్మ బాబో!! అంత సాహసమే! మొదటినుంచీ డాక్టరు, తన అసిస్టెంట్లకి చనువన్నమాట చవి చూపించినవాడుకాదు. ఆ డాక్టరు మొహంలో వున్న శక్తియేమిట్లో కాని, అతనిదగ్గిర అనవసరప్రసక్తి తేవడానికి ఎవరికేనా జంకే.

ఒకరోజున డాక్టరు శివరామయ్య మామూలు ప్రకారం ఆమె దగ్గిరకివెళ్లి ఛార్టు తీసిచూస్తున్నాడు. అప్పుడు డ్యూటీలోవున్న నారాయణ మూర్తి డాక్టరు వెనక్కాల నిలబడివున్నాడు. అర్ధనిద్రలో వున్న ఆమె కళ్లు తెరిచి డాక్టరుకేసిచూసింది. కొంచెంసేపు నిదానంగా చూసింది—బలహీనంగా, సన్నగా అంది.

ఆమె:—డాక్టరుగారూ, నేను బ్రతుకుతానా ?

ఆమె మాటలలోవున్న దైన్యానికి నారాయణమూర్తి చాలా జాలిపడ్డాడు.

డాక్టరు:—చూడాలి—చాలాకష్టముతో అన్నాడు ఆమాట.

ఆమె:—నన్ను బ్రతికించరూ; నాకు బ్రతకాలన్ని వుంది.

బ్రతకాలన్ని లేనివాళ్లు లేరుకాని, ఆ బలహీనతలో, అంతదీనంగా ఆమె చెప్పిన తనకోరికకు, డాక్టరు నిలువునా నీరైపోయాడు.

[డెబ్బైఒకటి

డాక్టరు:— నాచేత నైనంతవరకు ప్రయత్నిస్తాను.

ఆమె:— ఈ రోగము చంపగలదా అసలు?

డాక్టరు:— చంపడానికి రోగమే కావాలా! చంపే రోగమువచ్చి బ్రతికినవాళ్లు లేరూ!

ఆమె:— హూ — మీదయ. నన్ను బ్రతికించండి. నేనుచేసిన పాపానికి పశ్చాత్తాపపడుతున్నాను. దానికి తగినశిక్షకూడా అనుభవించేశానేమో, ఇంక, నేను బ్రతికితే, మీపా—

డాక్టరు:— అలాంటివేవీ చెప్పవద్దు. నీ ప్రాణం నా ప్రాణమంత విలువగలదానిగాజూసి, నేను మందువాడుతున్నాను.

ఆమె:— నిజంగానే!

ఆమెకళ్లు ఒక్కసారి ప్రజ్వరిల్లాయి. తృప్తీ, సంతోషమూ ఆ కళ్ళలో తాండవించాయి. ఇదంతా నారాయణమూర్తికి పెద్దగొడవ. ఆమెదైన్యమూ, డాక్టరు చూపించేకేవలమూ అంటే అంటునితనమూ అతనికేమీ అవగాహనకాలేదు. వాళ్ళిద్దరి సంభాషణా వింటూ అలాగే వుండిపోయాడు. డాక్టరు, ప్రిస్క్రిప్షనులో యేదో మార్పుచేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు. నారాయణమూర్తి, ఆమె ఛార్టును తీసిచూశాడు. ప్రిస్క్రిప్షనులో డాక్టరు చేసినమార్పు అతనికి అర్థమయింది. ఛార్టూ, ప్రిస్క్రిప్షనూ, ఆంగ్లోయిండియను నర్సుకి యిచ్చి అతనుకూడా అవతలికి వెళ్లాడు.

ఆరాత్రి పదిగంటలదాకా డ్యూటీ నారాయణమూర్తిదే. సాయంత్రము ఆరుగంటలయేసరికి అతడు ఆమెదగ్గిరకి వచ్చాడు. ఆమె మేలుకొనే